ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

- 'బడి బాట'పై ప్రత్యేక శ్రద్ధ వహించండి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, జూన్ 7: బడిబాట కార్యక్రమం పై ప్రత్యేక దృష్టిసారించి బడీడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బడిబాట కార్యక్రమ నిర్వహణపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. సర్కారు బడుల్లో కల్పిస్తున్న వసతులు, మెరుగైన విద్యాబోధనపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడాలన్నారు. బాలికలు డ్రాప్‌అవుట్ కాకుండా చూడాలని, మహిళా, శిశుసంక్షేమశాఖ అధికారులు సైతం బడిబాటలో పాల్గొనాలని సూచించారు. బాలికల తల్లిదండ్రులకు విద్యాప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమలు, హోటల్స్, ఇటుకబట్టీలను తనిఖీ చేయాలని, అక్కడ ఎవరైనా బాల కార్మికులు కనిపిస్తే వారిని వెంటనే పాఠశాలల్లో నమోదు చేయాలని సూచించారు. డీఈవో మాట్లాడుతూ, ఈ నెల 19వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటి సర్వే ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. 11న ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి, బడిబాటలో జరిగిన పురోగతిని చర్చించాలన్నారు. 12న అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన పనులు వివరించాలని, 13న తొలిమెట్టు కార్యక్రమం గురించి వివరించాలని, 14న ప్రాథమిక విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలని, 15న బాలికల విద్యా ప్రాముఖ్యతను వివరించాలని, 18న ఐవీపీ ప్యానల్ ద్వారా డిజిటల్ విద్యాబోధనను ప్రారంభించాలని, విద్యార్థులతో మొక్కలు నాటించాలని, 19క్రీడా పోటీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, జడ్పీసీఈవో ఉమారాణి, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్ రావు, అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్-1 ప్రిలిమినరీ

అధికారులందరూ సమన్వయంతో పని చేసి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో ఈ నెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షపై అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 4,699మంది అభ్యర్థులు పరీక్షకకు హాజరుకానున్నారని, ఇందుకోసం జిల్లాలో ఏర్పాటు చేసిన 15కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్‌ను (9398684240) సంప్రదించాలన్నారు. ఇక్కడ ఆర్డీవో రమేశ్, ఆర్సీవో వడ్లూ రి శ్రీనివాస్, డీఆర్డీవో శేషాద్రి, డీపీవో వీర బుచ్చయ్య, డీటీవో లక్ష్మణ్, ఎక్సైజ్ సూపరిం టెండెంట్ పంచాక్షరి, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఈఈలు శ్యామ్‌సుందర్, సూర్యప్రకాశ్ ఉన్నారు.

మరమ్మతులు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. పనుల పురోగతిపై ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు ఎన్ని పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగతా పనులు త్వరగా పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీసీఈవో ఉమారాణి, డీఆర్డీవో శేషాద్రి, డీఈవో రమేశ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: నాగంపేటలో విద్యార్థుల పేర్లు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట: ఒగులాపూర్ గ్రామంలో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

'సర్కారు బడి'పై నమ్మకం ఉంచండి

- ఊరూరా కొనసాగుతున్న 'బడిబాట'
- వసతులు, విద్యా బోధనపై అవగాహన ర్యాలీలు

ప్రభుత్వ బడులపై నమ్మకం ఉంచండి.. మీ పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పించండి.. వారికి బంగారు భవిష్యత్ అందించే బాధ్యత మాది.. అంటూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్నారు. శుక్రవారం పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధన, కల్పిస్తున్న వసతులపై వివరిస్తూ అవగాహన ర్యాలీలు తీశారు. బడీడు పిల్లలను తప్పనిసరిగా సర్కారు బడుల్లోనే చేర్పించాలని కోరారు.

ముస్తాబాద్: రామలక్ష్మణులపల్లెలో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

ముస్తాబాద్, జూన్ 7: ఆవునూర్, రామలక్ష్మణపల్లిలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. రెండు గ్రామాల్లో పది మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారని హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. సర్కారు బడుల్లో కల్పిస్తున్న వసతులు, విద్యాబోధనపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వివరించారు.

ఇల్లంతకుంట, జూన్ 7: ఒగులాపూర్, తిప్పాపూర్, రేపాక, గొల్లపల్లి గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లితండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: సర్కారు బడిలో నాణ్యమైన విద్య అందుతున్నదని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిండ్రులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంభీరావుపేట, జూన్ 7: నాగంపేటలో కాలనీలలో విద్యార్థుల పేర్లను ఉపాధ్యాయులు నమోదు చేసుకున్నారు. సర్కారు బడిలో అందిస్తున్న విద్యా బోధన, వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇక్కడ హెచ్‌ఎం బాలెల్లయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఎల్లవ్వ, ఉపాధ్యాయులు ఉన్నారు.

చందుర్తి, జూన్ 7: లింగంపేటలో బడిబాట నిర్వహించారు. సర్కారు బడిలో చేరిన వారికి ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనంతోపాటు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీలు తీశారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు గ్రామస్తుల సహకారం అందించాలని కోరారు.

చందుర్తి: విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అందుబాటులో ఉండాలి

- రైతులకు సాగులో మెళకువలు అందించాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- వ్యవసాయశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

కలెక్టరేట్, జూన్ 7: నిత్యం అన్నదాతలకు అందుబాటులో ఉంటూ.. సాగులో మెలకువలు అందించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. వానకాలం సాగుపై జిల్లాలోని ఏవోలు, ఏఈవోలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఏవోలు, ఏఈవోలు తమ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండాలని, సాగులో మెలకువలు అందించాలని సూచించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. లూజ్, గుర్తింపు లేని వారి వద్ద విత్తనాలు కొనవద్దని, ప్రభుత్వ, వ్యవసాయ శాఖ గుర్తింపు ఉన్నవే కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు తమ పరిధిలోని దుకాణాల్లో నిత్యం తనిఖీ చేయాలని, స్టాక్ రిజిస్టర్, నిల్వలు సరిచూసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా కొరత సృష్టిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల విషయంలో రైతులు ఆందోళనపడవద్దని సూచించారు. ఇక్కడ జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాస్కర్, తదితరులు ఉన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

బెటాలియన్‌లో ఇంటర్వ్యూలు

సిరిసిల్ల రూరల్, జూన్ 7: సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 11, 12 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కమాండెంట్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత పత్రాలతో బెటాలియన్‌లో కాన్ఫరెన్స్ హాల్‌కు ఉదయం 8గంటలకు హాజరు కావాలన్నారు. వివరాల కోసం నంబర్లలో (8712657570,8712589923) సంప్రదించాలని కోరారు.

30న సర్వసభ్య సమావేశం

సిరిసిల్ల టౌన్, జూన్ 7: జిల్లా వెలమ సంక్షేమ మండలి మూడో పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించే సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

వాహనాల పన్ను చెల్లించాలి

కలెక్టరేట్, జూన్7: జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహనదారులు పెండింగ్ వాహన పన్ను చెల్లించాలని జిల్లా రవాణాశాఖ అధికారి వీ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్ పన్నులు చెల్లించని వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే సంబంధిత వాహనం పన్నుపై అపరాధ రుసుం మొదటి నెల 50శాతం, రెండో నెల వంద శాతం, మూడో నెలలో 200శాతం అదనంగా వసూలు చేస్తామన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో వాహన పన్ను చెల్లించాలని సూచించారు.

ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ పొందాలి

కలెక్టరేట్, జూన్ 7: ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు తప్పనిసరిగా రాష్ట్ర అగ్నిమాపకశాఖ నుంచి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ పొందాలని కలెక్టర్ అనురాగ్‌జయంతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 144 ప్రైవేట్ దవాఖానలు ఉన్నాయని వెల్లడించారు. ఆయా దవాఖానల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకున్న వారందరూ తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ వెబ్‌సైట్ (https://fire.telangana.gov.in)లో తమ దవాఖాన వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం అగ్నిమాపక శాఖ వారితో ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయించుకొని సర్టిఫికెట్ పొందాలన్నారు.

గిరిజన 'ఫైన్ ఆర్ట్స్'లో ప్రవేశాలకు ఆహ్వానం

సిరిసిల్ల రూరల్, జూన్ 7: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రజినీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ బీఏ హానర్స్ ఫ్యాషన్ డిజైన్, బీఏ హానర్స్ ఇంటిరియల్ డిజైన్, ఫొటోగ్రఫీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గిరిజన, గిరిజనేతర విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ నెల 13వరకు దరఖాస్తుల గడువు పొడిగించామని, ఇంటర్ పూర్తయిన విద్యార్థినులు సంబంధిత విద్యార్హత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం నంబర్‌ను (95020-82958) సంప్రదించాలని సూచించారు.

10నుంచి మొదటి విడుత ధ్రువపత్రాల పరిశీలన

వేములవాడ రూరల్, జూన్ 7: టీజీఈసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి విడత ధ్రువ పత్రాలను ఈ నెల 10 నుంచి పరిశీలించనున్నట్లు అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8 నుంచి 11 వరకు అభ్యర్థులు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని, 10 నుంచి 12 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. 14 వరకు కళాశాలల ఎంపిక, వెబ్ ఆప్షన్లు ప్రక్రియ ఉంటుందన్నారు. 18న సీట్ల కేటాయింపు, 21 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ప్రతాలు వెంట తీసుకురావాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి, జూన్ 7: లింగంపేటలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. లింగంపేట గ్రామంలో బొజ సుభాష్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశామని తెలిపారు. ఇంట్లోని ఓ గదిలో 20క్వింటాళ్ల బియ్యం నిల్వ చేసి ఉండగా, సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు సుభాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడలో క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్ 7: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో 143 ప్రెస్ క్లబ్ సౌజన్యంతో సాయి క్రికెట్ టీం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మెగా క్రికెట్ పోటీలను ప్రభుత్వ విప్ ప్రారంభించి, మాట్లాడారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న మిని స్టేడియాన్ని యుద్ధ ప్రతిపాదికన అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. యువకుల కోసం మర్రిపెల్లిలో మైదానానికి స్థల పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, 143 క్లబ్ అధ్యక్షుడు రఫీ, నేతలు చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, పుల్కం రాజు, పులి రామ్ బాబు, కే రాకేశ్, ఫీర్‌మహ్మద్ ఉన్నారు.

విప్ ప్రత్యేక పూజలు

చందుర్తి, జూన్ 7: సనుగుల గ్రామంలోని శ్రీ గోవిందరాజుల స్వామివారిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఇక్కడ జడ్పీటీసీ నాగంకుమార్, ఎంపీటీసీ మ్యాకల గణేశ్, నాయకులు ఏగోళం శ్రీనివాస్, నాగరాజు, భీమరాజు, కనకరాజు, బొజ్జ మల్లేశం ఉన్నారు.

13న మెగా జాబ్ మేళా

- యువత సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్: మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, జూన్ 7: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కల్యాణలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన కంపెనీల ప్రతినిధులతో కలిసి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ నెల 13న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కల్యాణ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో సుమారు 60కి పైగా కంపెనీల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేశామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీయువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల రూరల్, జూన్7: తంగళ్లపల్లిలోని మండెపల్లి చౌరస్తాలో మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఎస్ఐ సుధాకర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఇక్కడ ఏఎస్ఐ చంద్రమౌళి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

శిక్షణ పొందిన విద్యార్థులతో పోపా ప్రతినిధి బృందం సభ్యులు

ఆంగ్ల భాషపై పట్టుతో ఉజ్వల భవిష్యత్

రాజన్న సిరిసిల్ల, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ఆంగ్ల భాషలో పట్టు సాధిస్తే ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పద్మశాలీ అఫిషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (పోపా) జిల్లా కార్యదర్శి పున్నం చందర్ పేర్కొన్నారు. పోపా ఆధ్వర్యంలో 120మంది పద్మశాలీ విద్యార్థులకు నెల రోజులపాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి పున్నం చందర్ హాజరై, మాట్లాడారు. స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో దోహదపడ్డాయని తెలిపారు. పేద విద్యార్థుల కోసమే ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్, బూర శ్రీనివాస్ ఇంగ్లిష్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రఘుపతి, గాజుల ప్రతాప్, మచ్చ ఆనందం, వాసాల హరిప్రసాద్, ఆడెపు వేణు, బూర శ్రీనివాస్, చేరాల తిరుపతి, బైరి రమాదేవి, కోడం పూర్ణిమ, సాంబారి జయరాం, పోపా ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ముస్తాబాద్, జూన్ 7: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీపీ జనగామ శరత్ రావు అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయాశాఖల అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శునకం నవగ్రహ ప్రదక్షిణ


నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న శునకం

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: గొల్లపల్లిలోని గీతా మందిరంలో ఓ కుక్క పిల్ల నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణ చేయడం వింతగా మారింది. శుక్రవారం శనిజయంతి కావడం అదే సమయంలో ఉదయం ఓ కుక్కపిల్ల 11 సార్లు నవగ్రహ ప్రదక్షిణ చేయడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. సదరు వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

వారంలోగా పెండింగ్ వేతనాలు అందించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కలెక్టరేట్, జూన్ 7: వారంలోగా గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు అందించకుంటే వారు విధులు బహిష్కరిస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి కూరపాటి రమేశ్ హాజరై, మాట్లాడారు. గ్రామాలను పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచడం కోసం తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా పని చేస్తున్న కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, నాయకులు అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, లింగంపల్లి కృష్ణవేణి, బుర్ర శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య, అంజయ్య, మహేశ్, నర్సయ్య, శ్రీనివాస్, రవీందర్, లక్ష్మణ్, గంగరాజు, భిక్షపతి, అనిల్, శేఖర్ ఉన్నారు.

కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 7: డబ్బులు లేనిదే ఎస్ఐ రమాకాంత్ పని చేయడం లేదంటూ మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు నేవూరి దేవేందర్‌రెడ్డి పలు వాట్సప్ గ్రూపుల్లో పోస్ట్ చేసి వైరల్ చేశాడు. దీంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించి దేవేందర్‌పై కేసు నమోదు చేశారు. ఎవరైనా తప్పుడు ఆరోపణలో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

కోనరావుపేట, జూన్7: మర్తనపేట గ్రామానికి చెందిన ముండ్రాయి సందీప్ (38) కరెంటు షాక్‌తో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సందీప్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ భారం మోస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆవుల షెడ్డుకు విద్యుత్ కనెక్షన్ తీగలకు సోదరుడు సాయికుమార్‌తో కలిసి మరమ్మతులు చేపట్టాడు. ఈ క్రమంలో ప్రమాదశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడి సోదరుడు సందీప్‌ను సిరిసిల్ల ఏరియా దవాఖనకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంట సభ్యుల రోదనలు మిన్నంటాయి. సందీప్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, మల్యాల దేవయ్య పరామర్శించారు.

చల్మెడ పరామర్శ

క్రాంతికుమార్‌ను పరామర్శిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, జూన్ 7: వేములవాడ పట్టణ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతికుమార్ తండ్రి శంకర్ ఇటీవల మృతి చెందగా, శుక్రవారం బాధిత కుటుంబాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. శంకర్ మృతికి గల కారణాలు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ చంద్రయ్యగౌడ్, కౌన్సిలర్లు జోగం శంకర్, నరాల శేఖర్, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, వాసాల శ్రీనివాస్, అంజాద్‌పాషా, మైలారపు రాము, తదితరులు ఉన్నారు.

బిడ్డ బర్త్ డే.. జవాను రక్తదానం

సిరిసిల్ల రూరల్, జూన్ 7: తన కూతురి పుట్టిన రోజు పురస్కరించుకుని ఆర్మీ జవాను రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వీరవేణి మధు ఆర్మీలో చేరి, దేశ సేవలు చేస్తున్నాడు. శుక్రవారం తన కూతురు పుట్టిన రోజు పురస్కరించుకుని సిరిసిల్లలోని ప్రభుత్వ దవాఖానాలో రక్తదానం చేశాడు. ఆర్మీ జవానుగా బార్డర్‌లో సేవలందిస్తున్న మధు మొదటిసారిగా తన కూతురు పుట్టిన రోజున రక్తదానం చేసినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★Karimnagar-Hyd Highway Road, R.K.Colony Residential & Commercial 6 Guntas Plots are available. Contact on: 7780646886.
NT-327730

CHANGE OF NAME

★I, MOHAMMAD IBRAHEEM S/o MOHAMMAD AHMED PASHA (ols name) Age 40 Years, R/o H.No: 6-75, Razvi Colony, Mandal Kannala, Dist Karimnagar., I have Changed my name as MOHAMMAD IBRAHIM S/O MOHAMMAD AHMED PASHA (New Name).
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194